తిన్న రేవు తల్వాలె

- మంచి చేసినోళ్లను మేం మర్లిపోం
- నలభై ఏండ్ల కాంగ్రెస్ పాలన.. పదేండ్ల బీఆర్ఎస్ పాలన చూసినం
- నాడు అరిగోస పడ్డం.. నేడు సంబురంగా ఉన్నం
- కేసీఆర్‌తోనే మా జీవితాలు బాగుపడ్డయ్ ● మాకు అండగా నిలిచిన ఆయన వెంటే ఉంటం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

కరీంనగర్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నాటి పాలనలో కుదేలైన ఎవుసాన్ని పండుగలా చేసి, రైతును నెమ్మదన్నుగా నిలిచింది రైతుబిడ్డ ముఖ్యమంత్రి కేసీఆరేనని కర్షకులు కొనియాడుతున్నారు. పదేండ్లలోనే 24గంటల కరెంట్, సాగునీరు, రైతుబంధు ఇచ్చి ఆసరా అయ్యారని, ధరణి పోర్టల్ తెచ్చి భూములకు భద్రత కల్పించారని ప్రశంసిస్తున్నారు. నాడు అరిగోస పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు మళ్లీ ఆగం చేయాలని చూస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ రాక ముందు దుర్భర పరిస్థితులు అనుభవించామని, ఆ నాడు వ్యవసాయరంగం పూర్తిగా ఆగమైందని నాటి రోజులను గుర్తు చేస్తున్నారు. కరెంట్ ఆరుగంటలని చెప్పినా మూడు గంటలు కూడా వచ్చేది కాదని, అది ఎప్పుడొచ్చేదో ఎప్పుడు పోయేదో కూడా తెలిసేది కాదని, అచ్చే కరెంట్ కోసం పొద్దంతా పడిగాపులు కాసేదని, రాత్రి పూట పొలాల వద్దకు ఎంతో మంది రైతులు విషకీటకాలు కుట్టో.. కరెంట్ షాక్‌తోనో చనిపోయారని, ఆ రోజులు మళ్లీ రావద్దని తల్చుకున్నారు. గోదావరి జలాలు సముద్రం పాలైనా చుక్క నీటిని ఒడిసిపట్టలేనని, సాగు నీటి వనతి లేక పంటలు ఎండుతున్నా.. భూములు బీళ్లుగా మారుతున్నా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. చివరకు అప్పుల్లో చిక్కుకున్నా, ఆ అప్పుల బారి నుంచి బయటపడలేక ఆత్మహత్యలు చేసుకున్నా.. వలస బాట పట్టినా.. కుటుంబాలు రోడ్డున పడినా కనీసం సాయం అందలేదని, ఇంకా ఆ రోజులు కండ్ల ముందే ఉన్నాయని యాది చేసుకున్నారు. నాడు భూములకు రక్షణ ఉండేది కాదని, ఎప్పుడు గొడవలే ఉండేవని, రైతు ఎలా చనిపోయినా రైతు బీమా కింద సాయం అందిస్తూ కుటుంబాలకు ఆసరా అవుతున్నారని అంటున్నారు. ఇంకా ధరణి పోర్టల్ తెచ్చి వ్యవసాయ భూములకు రక్షణ కల్పించి వివాదాలు లేకుండా చేశారని, నిమిషాల్లోనే భూములు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని, పత్రాలు ఇంటికే వస్తున్నాయని చెబుతున్నారు. భూమి వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటున్నాయని, క్షణాల్లో తెలుసుకోవచ్చని, అలాగే యజమానికి తెలియకుండా భూమి ఎట్టి పరిస్థితుల్లో ఇతరుల పేరుపైకి మారదని స్పష్టం చేస్తున్నారు. రైతులందరూ మంచిగున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నలభై ఏండ్ల పాలనలో తమ బాధలు ఎనాడూ పట్టించుకోలేదని, పైగా అరిగోసపెట్టిందని మండిపడుతున్నారు. ఇప్పుడొచ్చి మూడు గంటల కరెంటే సరిపోతుందని, అది ఎలా సాధ్యమంటే 10 హెచ్‌పీ మెటర్లు పెట్టుకోవాలని, రైతు బందుబారా అని, ధరణికి బంగాళా భాతంలో వేస్తామంటూ పూటకో మాట మాట్లాడుతూ పరేషాన్ చేస్తున్నారని ఆగ్రహించారు. వాళ్మను నమ్మితే మళ్లీ పాత రోజులే వస్తాయని, కారు చీకట్లు కమ్ముకుంటాయని, ఉచిత కరెంట్ పోతుందని అన్నదాతల బతుకులు ఆగమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరణి రద్దయితే పాత వ్యవస్థ వస్తుందని, ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో భూ సమస్యలు, కొట్లాటలు మొదలవుతాయని భయపడుతున్నారు. అందుకే కాంగ్రెస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వద్దని, కరెంట్, నీళ్కకు ఏబాధా లేకుండా చేసిన కేసీఆర్ వెంటే తాముంటామని చెబుతున్నారు. అన్నదాతలు తిన్న రేవు మరువరని, తమకు మేలు చేసిన కేసీఆర్‌కు అండగా ఉంటారని స్పష్టం చేస్తున్నారు.

వాళ్లవి తలాతోక తెల్వని మాటలు

నాకు మూడెకరాల పంట భూమి ఉన్నది. ఇందులో వరి, పత్తి పంటలు సాగు చేసుకుంటున్నమ్. బోర్లు, వ్యవసాయ బావుల్లో ఆధారపడి ఎవుసం చేసుకుంటున్నమ్. కాంగ్రెస్‌సోళ్లు మూడు గంటల కరెంట్ సరిపోతదంటుండ్రు. ఇంకా 10 హెచ్‌పీ మీటర్లు పెట్టుకోమంటున్నరు. బోర్లు. బావుల్లో నీరుంటదా? తలా తోక తెల్వనోళ్లు ఇష్టం అచ్చినట్టు మాట్లాడితే ఎట్లా? ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ దండిగా కరెంట్ ఇయ్యబట్టి మా భూములకు ధర సానా పల్కుతుంది. మా ఊరిలో ఒక్క ఎకరం భూమికి రూ. 40 లక్షల దాకా ధర పెట్టి కొంటున్నరు. ఎన్కట ఎకరానికి రూ. రూ. 10 లక్షల లోపే ఉండే. కరెంట్, సాగు నీరు లేక అప్పట్లో భూములను కానలోడే లేదు. ఎవ్వసం చేసేటోడు కన్పించలే. సానా గ్రామాల్లో ఎవ్వసం జెయ్యక భూములు బీడు పడ్డయ్. చేతినిండా పనిలేక పంటలు కరువై బతుకు దెరువు కోసం రైతులు వలస పోయింర్రు. మళ్లా కాంగ్రెస్ పాలన వస్తే ఎన్కటి రోజులే దాపురిస్తయ్. ఇప్పుడూ కరెంట్ 24 గంటలు ఇయ్యకపోతే పంటలు ఎట్ల పండుతయ్? మా భూముల ధరలు పడిపోతయ్. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు పెట్టి సాగు నీరు పంటలకు అందక అరిగోస పడినమ్. ఆ రోజులు పగోనికి కూడా రావద్దు. కరెంట్ ఎప్పుడు అత్తదో తెల్వక సలికాలం గజ గజ వణుకుతూ చీకట్ల టార్చిలైట్లు పట్టుకుని చెన్నకాడికి పోయినమ్. ఆ రాత్రి పూట పాము కాట్లకు మస్తు మంది రైతులు చచ్చిపోయింర్రా. సావులు సూచిన కుటుంబాలు ఆగమైనయ్. కాంగ్రెస్ మాటలు వింటుంటే గిప్పుడూ పాత కాలం నాటి పురుగు, పుట్ర కుట్టి సాన ఇబ్బందులు పడిన సంగతి తెల్సి వణుకు పడుతుంది. అట్లాంటి రోజులు మా రైతులకు సానా యాదికి వస్తున్నయ్. కరెంట్ ఇస్తున్న కేసీఆర్ సారుకే మేం జై కొడతం.

-కామల్ల లచ్చయ్య, రైతు, జూలపల్లి

10 హెచ్‌పీ మోటర్ల ఖర్చు ఎవడు భరిస్తడు..

కాంగ్రెసోళ్లు చెప్పే 10 హెచ్‌పీ మోటర్లు, మూడు గంటల కరెంట్‌తో రైతులకు నష్టం జరుగతది. మా గ్రామంలో ఇప్పటివరకైతే 10 హెచ్‌పీ మోటర్లను నేను సూడలే. 10 హెచ్‌పీ మోటర్లు వాడాలంటే వాటికి మళ్ల కనెక్షన్ వేరే తీసుకోవాలి. ఇప్పుడు ఇస్తున్న మోటర్ల కరెంట్ సరఫరా కెపాసిటి పెంచాలి. గ్రామంలో 5 హెచ్‌పీ మోటర్లకు మూడు కనెక్షన్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉండెది. మరీ 10 హెచ్‌పీ మోటర్లకైతే ప్రతి మోటర్‌కు ఒక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాల్సి ఉంటుంది. దానికి తగ్గట్లు డీటీలు చెల్లించాలి. మోటర్ కెపాసిటిని బట్టి బిల్లు వస్తుంది. ఉచిత కరెంట్ తీసేసి బిల్లు కట్టమంటే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఒక వేళ పాత ట్రాన్స్‌ఫార్మర్లను అట్లనే వాడితే లోవోల్టేజీతో మోటర్లు కాలిపోతయి. మన ప్రాంతంలో 10 హెచ్‌పీ మోటర్లకు రిపేర్ చేసే మెకానిక్‌లు కూడా దొరకరు. ఇట్లయితే ఇగ ఎవ్వసం సాగినట్టే. ఇంత ఖర్చు రైతు ఏడ నుంచి భరిస్తడు. మూడు గంటల కరెంటు సాలంటున్నమ్. ఆ కరెంట్‌తో ఒక్క దొయ్య అన్న పొరతదా..?కాంగ్రెసోళ్లు తలా తోక లేకుండా మాట్లాడుతున్నమ్. వాళ్లకేమన్న బుద్ధి ఉండాలే. కేసీఆర్ సారు ఇప్పుడిస్తున్న 24 గంటల కరెంట్‌తోని మస్తు పంటలు పండుతున్నయి. పాములు, పురుగు పూచిన భయం మాకు ఉండదు. మా ఇంటోళ్లు ఇప్పుడే రాత్రిలు కడుపు నిండ నిద్రపోతున్రు. గతంలో కాంగ్రెసోళ్లు కాలంలో కంటి పై నిద్రలేని రోజులు గడిపినం. ఆలాంటి రోజులు మళ్లీ రావద్దని కోరుకుంటున్నం. మళ్ల కేసీఆర్ సారే రావాలి. మేం కేసీఆర్ సారుకే ఓటేస్తం.

- పెండ్యాల లవంతిక, మహిళా రైతు, చెర్లభూత్కూర్(కరీంనగర్ రూరల్)

వాళ్లత్తే కరెంట్‌ను కాటగలుపుతరు..

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 28: కాంగ్రెస్ ఉన్నప్పుడు కరెంట్‌రాక మస్తు బాధలనుభవించినం. ఉన్న భూమిలో సగం దాకానే పంటవేసేది. నీళ్లందకు అదిగూడ సక్కగా పండకపోయేది. వచ్చిన వడ్లను అమ్ముకుందామంటే అందుబాటులో కొనుగోలు కేంద్రాలు లేకుండే. సేట్లకు ఉద్దెరకు అమ్ముకునేది. వాని చుట్టూ తిరుగంగ పైసలు ఇత్తుండే. కానీ తెలంగాణ గవర్నెంట్ అస్సినంక ఎవ్వసం రందీలేకుండ్లైంది. మొత్తం భూమిని సాగు చేసుకుంటున్నం. రెండు పంటలు పండించుకుంటున్నం. ఎప్పుడే బోరేత్తే అప్పుడు నీళ్లు దుంకుతున్నయ్. కానీ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల టైంల మూడు గంటల కరెంట్ అంటూ, ధరణి ఎత్తేత్తమంటూ నోటికచ్చిన పలుకులు పలుకుతున్నరు. వాళ్లస్తే కరెంట్‌ను కాటగలుపుతరు. అందుకే వాళ్లను ఓటుతోనే గంగల కలుపుతం.

-పాలకుర్తి వెంకటస్వామి, కౌలురైతు, గుంటూరుపల్లి(ఫర్టిలైజర్‌సిటీ)

అబద్ధాల రేవంత్‌కు బుద్ధి చెప్తం

రేవంత్‌రెడ్డి మాటలు నమ్మశక్యంగా లేవు. మల్ల మా కేసీఆర్‌నే తెచ్చుకుంటం. గతంలో కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సరిగ్గా లేక పోచడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. మాటల గారడితో రైతులను పక్కదారి పట్టిద్దామనుకుంటున్న రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు రైతులం సరైన బుద్ధి చెబుతాం. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే గౌరవంగా బతుకుతున్నం. తెలంగాణ రైతులమంతా బీఆర్ఎస్ వైపే ఉన్నం. 24 గంటల కరెంటు ఉండాలంటే.. కేసీఆరే మళ్లీ అధికారంలోకి రావాలి. కాంగ్రెసోళ్లు హైకమాండ్ చెప్పింది చేస్తరు. మా కేసీఆర్‌కు ప్రజలే హైకమాండ్, కనుక మేము చెప్పింది చేసే కేసీఆర్‌కే మా మద్దతు, ఓటు కూడా.

-శ్రీపాద రాజమౌళి, రైతు, కొత్తపల్లి (హుజురాబాద్‌టౌన్)

రాబంధులకు రాష్ట్రాన్ని అప్పగించం

తొమ్మిదేళ్లుగా వ్యవసాయం సంతోషంగా చేసుకుంటున్నం. ఎలాంటి సమస్యలు లేకుండా పండుగలా పనులు సాగుతున్నయి. తెలంగాణ ప్రభుత్వం హయాంలో ఎరువులు, కరెంటు, ధాన్యం విక్రయానికి ఎలాంటి ఇబ్బంది లేదు. అలాంటిది ఇప్పుడు, ధరణి ఎత్తేస్తాం, మూడు గంటల కరెంటు ఇస్తాం అని వచ్చేటోళ్కకు ఎట్లా ఓటు వేస్తాం. పూర్తి స్థాయిలో కరెంటు కష్టాలు లేకుండా చూసింది కేసీఆర్ సారు. ఆలాంటి సారు రాష్ట్రం పచ్చగా ఉండాలనే చూస్తుండం. ఇలాంటి సమయంలో రాబంధులకు రాష్ట్రం అప్పగించి ఎలా సంతోషంగా ఉంటం. కాంగ్రెస్ అచ్చేది లేదు.. సచ్చేది లేదు.

- సల్ల కిష్టయ్య, రైతు, అల్లనూర్(తిమ్మాపూర్)

10 హెచ్‌పీతో ఖర్చుల పాలే

రైతులం ఎక్కువగా 3, 5 హెచ్‌పీ మోటర్లే వాడుతం.ఎక్కువ దూరం పైపులు వాడినా ఎట్లాంటి బాధుండదన 5 హెచ్‌పీ మోటర్లు వాడుతం.10 హెచ్‌పీ మోటర్లు వాడితే రూ.వేల రూపాలు ఖర్చు చేసుడుతో పాటు కరెంట్ ఎక్కువ తక్కువ వస్తే రైతులకు రిపేర్‌ల బాదలు తప్పవు.ఇప్పుడు వాడుతున్న స్టార్టర్లు, మోటర్లు, పైపులైన్‌లు మార్కుకోవాల్సి ఉంటది.వాటికి లక్షల్లో ఖర్చు అయితది.రైతులు ఖర్చుల పాలు కావల్సిందే.కమర్షియల్ కరెంట్ కనెక్షన్లు తీసుకోవాల్సి అస్తది.10 హెచ్‌పీ మోటర్లు వాడితే ఎక్కువ కరెంట్ అవసరం ఉంటది. ఇప్పుడున్న ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతయి.గతంలోనే కరెంట్ ఎక్కువ తక్కువ వస్తే పడరాని పాట్లు పడ్డం.మళ్ళా ఆ బాదలు పడాలని ఏ రైతు కోరుకుంటలేడు.ఇప్పుడున్న కరెంట్‌తోని రైతులు సంతోషంగ ఉన్నరు.రైతుల కష్టాలు తెలిసిన కేసీఆరే మళ్ళా సీఎం కావాలే.

-దాసారపు కొమురయ్య, రైతు, వీణవంక.

అచ్చిరాని కరెంట్‌తోని మోటర్లు కాలేది

కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అచ్చీరాని కరెంట్‌తోని మోటర్లు కాలేది.కరెంట్ కోసం గంటల లెక్క ఎదిరిచూసేది.ఆ కరెంట్ ఎక్కువ తక్కువ అచ్చే సరికి ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయేది.15 రోజులకోసారి ట్రాన్స్ ఫార్మర్లను హుజూరాబాద్‌కు తీసుకపోయి మనికిన్న పైసలు ఏసుకొని రిపేర్ చేయించేది.రిపేర్ చేసుడు లేట్ అయితే పొలాలు ఎండి నెర్రలు వారేది. కరెంట్ కావాలని ధర్నాలు చేసేది.పోలీసులు అరెస్ట్ చేసి, కేసులు కూడ పెట్టిపోళ్ళు.బాయిల కాడ రాత్రి పూట పండుకుంటే పాములు, తేళ్ళు పారేది.అరగోస పడ్డం.పంటలు పండుతయో ఎండుతయో తెలువని పరిస్థితి ఉండేది.అట్లాంటిది కేసీఆర్ 24 గంటల కరెంట్ బచ్చినసంది బంగారు పంటలు పండుతన్నయి.ఇయ్యాల రైతులంద సంబురంగ ఉంటున్నమంటే కేసీఆర్ 24 గంటల కరెంట్, నీళ్ళు పుల్‌గా ఉండడం వల్లనే.కాంగ్రెస్‌తోని ఏగింది చాలు..మళ్ళా కేసీఆర్ ప్రభుత్వమే రావాలే.

-చింతల రాజయ్యగౌడ్, రైతు, రెడ్డిపల్లి గ్రామం, వీణవంక.

భూములు పడావు ఉంటయ్..

సీఎం కేసీఆర్ పాలనలో రైతులకు మంచి రోజులచ్చినయ్. రైతుబంధు, రైతుబీమా పథకాలతో భూముల ధరలు బదు రేట్లు పెరిగినయ్. 24 గంటలు ఉచిత కరెంటుతో ఇస్తుండడంతో రైతులకు వ్యవసాయం ఈజీ అయింది. ఎవ్వసంపై మొగ్గు చూపే వారి సంఖ్య పెరిగింది. ఊర్లల్ల కొనేవాళ్లు ఎక్కువవడంతో భూముల ధర ఎకరానికి రూ.30 లక్షల వరకు పలుకుతుంది. గతంలో రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలుండేది. మిషన్‌కాకతీయతో చెరువుల్లో నీళ్లుంటున్నయ్. బావుల్ల భూగర్భజలాలు పెరిగినయ్. పంటల సాగు ఎక్కువైంది. రైతులు రందీ లేకుండా బతుకుతున్నరు. మళ్లీ కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే అరిగోస తప్పదు. వాళ్లు 24 గంటల కరెంటిస్తరా? 3 గంటలని ఇప్పుడే చెప్పవట్టె. మళ్లీ కరెంట్ కోతలు వచ్చి, నీళ్లు పారక ఎవ్వసం బందయితది. భూములు పడావు ఉంటయ్.. ధరలు అమాంతం పడిపోతయ్.

- కొత్త మధుసూదన్‌రెడ్డి, రైతు, వెన్నంపల్లి (సైదాపూర్)

ధరణి వద్దన్న పార్టీ మాకద్దు..

గతంల కాంగ్రెస్ ఉన్నప్పుడు భూముల రికార్డులు సక్కగా లేక అరిగోస పడ్డం. ఇప్పుడున్న పట్వారులు ఒగని భూమి ఇంకొని పేరు మీద రాసిండ్రు. పాలోండ్లు, పక్కొళ్ల నడుమ పంచాయితీలు పెట్టేది. పాసు బుక్కుల గూడ తప్పులు తడకలుగా ఎక్కిచ్చేది. సరి చేసిందుకు వాళ్ల సుట్టూ చెప్పులరిగిలా తిరిగేది. మళ్లా పైసలు తడిపితేగాని పనిచేసేదికాదు. రైతుల బాధలు తెలిసినా సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చిండు. కొలందారు కాలం ఎత్తేసి భూములకు భద్రత కల్పించిర్రు. రిజిస్ట్రేషన్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే గోస తీర్చిర్రు. ఎవ్వనికి పైసా లంచం తడుపకుండానే పనేయ్యటట్టు జేసిర్రు. రైతులు బాగుపడుతుంటే ఓర్వలేని కాంగ్రెసోళ్లు ఏదో కొత్త పోర్టల్ తెస్తమని గప్పాలు గొడుతున్నరు. రైతుల భూముల కొల్లగొట్టేందుకు కుట్రలు జేత్తున్నరు. వాళ్లు వచ్చేది లేదు..సచ్చేది లేదు గానీ రైతులను ఆగంపట్టిత్తున్నరు. అయినా ధరణి వద్దన్నా కాంగ్రెస్ మాకొద్దు. ఓటుతోనే వాళ్లకు బుద్ధిచెబుతం.

-గంగిపల్లి శంకరయ్య, రైతు, జూలపల్లి, జూలపల్లి మండలం, పెద్దపల్లి జిల్లా

తహసీల్ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తది

ధరణి పోర్టల్‌లో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. స్లాట్ బుక్ చేసిన వెంటనే తహసీల్ ఆఫీసులో భూమి రిజిస్ట్రేషన్ చేసి మ్యుటేషన్, పాసు పుస్తకం ఇస్తున్నరు. కాంగ్రెస్ నాయకులు భూమాత పోర్టల్ తీసుకువస్తే పాత పద్ధతిలో పట్వారీ, గిర్దవార్లు, తహసీల్ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తది. భూములకు భద్రత కూడా ఉండదు. ఒకరి భూమి మరొకరి పేరుపై మారుస్తరు. కాంగ్రెస్ నాయకులకు అవగాహన లేకుండా మాట్లాడుతున్నరు.

-సోమిరెడ్డి మునీరెడ్డి, జూబ్లీనగర్, (కరీంనగర్ రూరల్ మండలం)

లంచం ఇస్తేనే పట్టాలు పాస్‌బుక్కులు వచ్చేవి

తెలంగాణ ప్రభుత్వం ధరణి తీసుకువచ్చినప్పటి నుంచి రైతులకు ఎలాంటి కష్టాలు లేవు. అంతకుముందు పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు భూములు పట్టాలు కావాలంటే ఏండ్ల తరబడి తిరిగేవాళ్లం. పట్టాలు అయినంక పాస్‌బుక్‌లు ఇవ్వకపోయేది. లంచం ఇస్తేనే పట్టాలు పాస్ బుక్‌లు వచ్చేవి. కానీ, ధరణి వచ్చినప్పటి నుంచి ఎలాంటి కష్టాలు లేకుండా ఒక్క రోజులోనే పట్టా అవుతుంది. పాత పాస్ బుక్ ఉంటే వెంటనే పట్టాచేసుకున్న సర్వేనంబర్‌ను ఎక్కిస్తున్నరు. ప్రాసీడింగ్ కాపీ ఇస్తున్నారు. కొత్త పాస్ బుక్ కావాంటే వారం లేక పది రోజుల్లో పాస్టులోనే ఇంటికి వస్తున్నాయి. కాంగ్రెస్ వాళ్లు పాత పట్వారీ వ్యవస్థ తీసుకువస్తామంటే ఊరుకునే ప్రసక్తేలేదు.

-కాసర్ల సుధాకర్‌రెడ్డి, కందుగుల, రైతు (హుజురాబాద్ రూరల్)

నాటి ఇబ్బందులు గుర్తుకు వస్తే కండ్ల పొన్న నీళ్లు వస్తయ్

ధరణి వచ్చినంక మా భూములు భద్రంగా ఉన్నయ్. ఇదివరకు వీళర్వోలు ఇష్టం వచ్చినట్టు ఒకరి భూములు ఇంకొకరి పైరు మీద మార్చేవారు. దీంతో గొడవలు జరిగేవి. పోలీసు కేసులయ్యేవి. ఎంతో మంది జైలు పాలైన రోజులు కూడా ఉన్నాయి. భూమి పట్టాల గురించి రైతులు పడ్డ ఇబ్బందులు గుర్తుకు వస్తే కండ్ల పొన్న నీళ్లు వస్తయ్. రైతులకు వరంలా ఉన్న ధరణి తీసేస్తమంటున్న కాంగ్రెసోళ్లకు తగిన గుణపాఠం తప్పదు. అలాంటిది ఇప్పుడు ధరణితో ఆ సమస్యలు తొలగిపోయినయ్. దాన్ని కాంగ్రెసోళ్లు తొలగిస్త మంటే ఊరుకుంటమా. బీఆర్ఎస్ సర్కారు రైతులకు చేసిన మేలును మరుస్తమా?.

- రావుల వెంకట్‌రెడ్డి, కందుగుల, రైతు (హుజురాబాద్ రూరల్)

కాంగ్రెస్‌ను రానివ్వం

పాతకాలం పద్ధతి మళ్లీ తెచ్చి రైతు పట్టాదారు పాసు పుస్తకం, రెవెన్యూ రికార్డుల్లో కౌలుదారులు, కబ్జాదారుల కాలం ఏర్పాటు చేస్తే భూ యజమానులకు, రైతులకు అన్యాయం జరుగతది. గతంల కబ్జాదారుల కాలంతో ఇబ్బందులుండేవి. అప్పుడున్న రెవెన్యూ వ్యవస్థలో చాలా లొసుగులు ఉండేటియి. అధికారుల చుట్టూ, పట్వారీల చుట్టూ తిరిగిన సమస్య పరిష్కారమయ్యేది కాదు. పాత పద్ధతి తీసుకొస్తే, భూ యజమానులకు కౌలు రైతులతో, కబ్జాదారులతో సమస్యలొస్తయి. రైతులు కూడా కౌలుకు ఇవ్వడానికి ముందుకొచ్చే పరిస్థితి ఉండదు. ప్రతి సంవత్సరం కౌలుదారున మార్కాల్సి వస్తది. కొత్త సమస్యలు వచ్చి పడుతయి తప్ప రైతులకు న్యాయం జరగదు. ఇవన్నీ ఆలోచించే కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకొచ్చిండు. ఇది మంచిగుంది. ఇప్పుడు రైతులు, భూయజమానులు, కౌలుదారులు సంతోషంగా ఉన్నరు. మళ్లీ పాత పద్ధతి తెస్తమంటున్న కాంగ్రెసేనే రానీయక పోతేనే మంచిది. మాకు కేసీఆర్ కావాలి. మళ్లీ బీఆర్ఎస్సే రావాలి.

- దాసరి మల్లారెడ్డి, ప్రశాంతినగర్(కరీంనగర్ రూరల్)

మళ్లీ పల్లెల్లో పంచాయితీలే ..

ధరణి ఎత్తేస్తే మళ్లీ పంచాయితీలే ఉంటాయ్. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ రైతుల భూములకు రక్షణ లేకుండా చేసింది చాలదా. పట్వార్లకు చేతి వాటం ఇస్తే రికార్డులు తారుమారు చేసుకోవచ్చు. భూ రికార్డుల్లో పేర్లను, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ధరణితో ఏ రికార్డుల్లో ఎంత భూమి ఉందో, ఏవరి పేరున ఉందో మన మొబైల్‌లోనే వివరాలు చూసుకోవచ్చు. అక్రమాలు జరిగితే మన మొబైల్‌కు సమాచారం అందుతుంది. పట్టా చేసుకోవల్సి వస్తే యజమాని వేలి ముద్రలు అవసరం కాబట్టి వేరే వారికి మార్చిడి చేయకుండా భద్రంగా ఉంటుంది. ధరణితో రికార్డులు భద్రం. భూములు ధరలు భారీగా పెరిగినాయ్. అధికారుల మాసాలు తగ్గినయ్. అమ్మినా, కొన్న సులభతరంగా రిజిస్ట్రేషన్లు అవుతున్నయ్.

-సింగిరెడ్డి భాస్కర్ రెడ్డి, రైతు, సదాశివపల్లి, కరీంనగర్ జిల్లా

కాంగ్రెస్సోళ్లకు ఎవ్వసం గురించి తెల్వదు..

సీఎం కేసీఆర్ ఇస్తున్న నాణ్యమైన ఉచిత కరెంట్‌తో రెండు పంటలు సంతోషంగా పండించుకుంటున్నాం. మాకున్న వ్యవసాయ భూమికి 5 హెచ్‌పీ మోటార్లతో పంటలు మడి మడికి నీళ్లను పారించుకుంటూ సాగు చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఇప్పుడిస్తున్న 24 గంటల కరెంటేను రద్దు చేసి 3 గంటలు మాత్రమే కరెంట్ ఇత్తనని అంటున్నది. 10హెచ్‌పీ మోటార్లను రైతులు వాడాలని కాంగ్రెస్ నాయకులు అన్నడం చాలా విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్సోళ్లకు ఏవ్వసం అంటేనే తెలియదని వారు మాట్లాడుతున్న తీరు చెప్తున్నది. తెలంగాణలో సన్నకారు రైతులే ఎక్కువ అలాంటి రైతులు 5 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవడమే ఎక్కువ అయితుంటే 10 హెచ్‌పీ మోటార్లు ఎక్కడైనా పెట్టుకుంటారా..? వాళ్లు మాట్లాడే తీరు చారానా బిళన్‌కు బారాన మసాలా వాడినట్టుగా ఉంది.

-చింతం రఘు, పోతారం, మంథని మండలం, పెద్దపల్లి జిల్లా

రాత్రింబవళ్లు బాయి కాడనే ఉండాలె

వ్యవసాయంపై అవగాహన లేక కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నరు. మూడు గంటల కరెంట్ ఇస్తే నీళ్లు అందక వేసిన పంట మొత్తం ఎండిపోతది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే ఖర్చుతో కూడుకున్న పని. ఇప్పుడు మళ్ల మూడు గంటల కరెంట్ ఇస్తే రాత్రింబవళ్లు బాయిల కాడనే ఉండాలి. కాంగ్రెసోళ్ల మాటలను రైతులు నమ్మడం లేదు. వాళ్లతో ఏ పని కాదు. రైతుల కోసం కేసీఆర్ సారు ఎన్నో పథకాలు తెచ్చిండు.సారు వస్తేనే రైతులంతా సంతోషంగా ఉంటరు.

-సంగమల్ల శ్రీనివాస్, జూబ్లీనగర్, (కరీంనగర్ రూరల్ మండలం)

దరిదాపులకు కూడా రానివ్వద్దు

తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటుతో చాలా ప్రాధాన్యత ఉంది. పుక్కులంగా నీళ్లిస్తుండడంతో బంగారం లంటి పంటలు పండిస్తున్నం. తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా ఆవిర్భవించడం గర్వకారణం. నిరంతర కరెంట్‌తో కష్టాలు తొలగినయ్. ఈ సర్కారు రైతులకే కాదు, వ్యాపార, వాణిజ్య వర్గాలకు అండగా నిలుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుపోతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ ఎనుకటిలెక్క అంధకారమే..అందుకే కాంగ్రెస్‌ను అధికారానికి దరిదాపులకు కూడా రానివ్వద్దు.

-శనిగరపు దామోదర్, రైతు (హుజురాబాద్‌టౌన్)

3 గంటలతో దొయ్య కూడా పారదు..

రేవంత్‌రెడ్డి..ఎవుసానికి మూడు గంటల కరెంట్ సాలంటున్నడు. గిట్లయితే ఏ మూలకు సరిపోదు. ఒక్క దొయ్య కూడా పారదు. గిది గూడ తెల్వని కాంగ్రెసోళ్లను ఏమనాలో అర్థమైతలేదు. ఆయనకు ఎవ్వసం చేత్తనేమో ఎరుకైతది. దుక్కి దున్నడం తెలుసా? పంట చేతికచ్చేదాకకెంత తిప్పలుంటయో తెలుసా? ఏం తెలుసు ఆయనకు అని అడుగుతున్న ఎవ్వసమంటే తీసివారేసినట్టే మాట్లాడుతున్నరు. 3 గంటల కరెంటు ఎవరి ముక్కులో పెడ్తరట. పదెకరాలు ఉన్న రైతు పరిస్థితి ఏం ది. 3 గంటలకు మూడెకరాలు కూడా తడ్వది. సరిపోదు.. పైగా 10 హెచ్‌పీ మోటర్లట బావులుకాడ బోర్లకాడ ఎవర్దైన పది హెచ్‌పీల మోటర్లు పెట్టుతారా? 3 లేదా 5 హెచ్‌పీ మోటర్లే ఎక్కువ ఇంగుత జ్ఞానం లేని రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి ఏమీ యెరుక కేసీఆర్ గవర్నమెంట్ అచ్చినంక కదా 24 గంటల కరెంటు, ప్రాజెక్ట్‌లు కట్టి సమృద్ధిగా నీళ్లు వస్తున్నాయి. ఏట మూడు పంటలు పండుతున్నాయి.

-సాగర్ల తిరుపతి రైతు , రత్నాపూర్, రామగిరి మండలం, పెద్దపల్లి జిల్లా